సాక్షి
రాజన్న సిరిసిల్ల
సోమవారం । 28 । ఆగస్టు । 2023

కేసీఆర్ నగర్‌లో నీటి కష్టాలు



తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండెపల్లి డబుల్ బెడ్‌రూం(కేసీఆర్ నగర్) సముదాయంలో లబ్ధిదారులు నీటికష్టాలు ఎదుర్కొంటున్నారు. డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలోని ఓవర్‌హెడ్ ట్యాంకులో లీకేజీలతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. జిల్లా అధికారులు స్పందించి వాటర్‌ట్యాంక్‌కు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

న్యూస్‌రీల్

క్రీడలతో పోటీతత్వం పెంపు

- అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్
- ముగిసిన ఇషా గ్రామోత్సవ్ క్రీడలు



బహుమతులు అందిస్తున్న అధికారులు

సిరిసిల్లటౌన్: క్రీడలతో పోటీతత్వం పెంపొందుతుందని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ పేర్కొన్నారు. ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిరిసిల్ల మినీస్టేడియంలో గ్రామీణ క్రీడోత్సవ్‌లో భాగంగా క్రీడాపోటీలను ప్రారంభించి మాట్లాడారు. రాత్రి నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో డీపీఆర్వో మామిండ్ల దశరథం, డీవైఎస్‌వో రాందాస్ విజేతలకు బహుమతులు అందించారు. వాలీబాల్‌లో ప్రథమ బహుమతి దుమాల, ద్వితీయ వంతడ్పుల, తృతీయ వీర్నపల్లి, నాలుగో బహుమతి దుమాల హిట్లర్స్, త్రోబాల్ పోటీల్లో ప్రథమ రాచర్లగొల్లపల్లి, ద్వితీయ రాజన్నపేట, తృతీయ రాచర్ల బొప్పాపూర్, నాలుగో బహుమతి కొత్తపల్లి గ్రామ టీమ్‌లు గెలుపొందాయి. ఇషా ఫౌండేషన్ ప్రతినిధులు అజయ్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణాధ్యక్షుడిగా ప్రకాశ్



సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు చొప్పదండి ప్రకాశ్‌ను నియమిస్తూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల అధ్యక్షులను నియమించారు. ఎల్లారెడ్డిపేట అధ్యక్షుడిగా ఎస్.లక్ష్మారెడ్డి, గంభీరావుపేట మహ్మద్ హమీద్, ముస్తాబాద్‌కు ఎల్లారెడ్డి, తంగళ్లపల్లికి ప్రవీణ్, వీర్నపల్లికి బూత శ్రీనివాస్‌లను నియమించారు.

తెలుగు ఉపాధ్యాయుడికి ప్రథమ బహుమతి



చందుర్తి(వేములవాడ): మండలంలోని బండపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు పండితుడు సత్యప్రవీణ్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి సాధించాడు. యూనివర్సిటీ 42 సంవత్సరాల వేడుకల్లో భాగంగా దూరవిద్య పితామహుడు ప్రొఫెసర్ గడ్డం రాంరెడ్డిపై వ్యాసరచన పోటీ నిర్వహించింది. రాంరెడ్డి స్వగ్రామం బండపల్లిలో విధులు నిర్వహిస్తున్న తెలుగు పండితుడు సత్యప్రవీణ్ 'గడ్డం రాంరెడ్డి బాల్యం, ప్రాథమిక విద్య'పై రాసిన వ్యాసానికి ప్రథమ బహుమతి దక్కింది. యూనివర్సిటీ వీసీ సీతా రామారావు, డైరెక్టర్ గంట చక్రపాణి చేతుల మీదగా ఆదివారం అవార్డు అందుకున్నారు.

తల్లిదండ్రులు పరమాత్మతో సమానం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తల్లిదండ్రులు, గురువులు పరమాత్మతో సమానులని సత్సంగ సదనం అధ్యక్షుడు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలోని సత్సంగ సదనంలో ఆదివారం శ్రావణ ఏకాదశి సందర్భంగా లక్ష్మారెడ్డి ప్రవచనాలు చేశారు. ప్రతి ఒక్కరికి మొదటి గురువులు తల్లిదండ్రులేనని, పరమాత్మ కంటే ముందు తల్లిదండ్రులకు నమస్కరించాలని సూచించారు. అనంతరం భక్తురాలు లక్ష్మమ్మ, సంజీవరెడ్డి ఆధ్యాత్మిక సత్సంగం చేశారు.

కొనసాగుతున్న నిరసన



సిరిసిల్లటౌన్: రాష్ట్ర సర్కారు తమ సమస్యలు పరిష్కరించాలని మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డు దేవయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్లలో చేపడుతున్న రిలేదీక్షలను ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. ఇన్ని రోజులుగా దీక్షలు చేస్తుంటే తమను పట్టించుకోకపోవడం సరికాదన్నారు. న్యాయం జరిగే వరకు తాము చేపట్టిన దీక్షను విరమించబోమని హెచ్చరించారు. దీక్షల్లో బుర్ర మల్లేశ్‌గౌడ్, గుమ్మడి కాంతయ్య, అలువాల లక్ష్మారెడ్డి, సత్యనారాయణరెడ్డి,మల్లారెడ్డి, గౌరయ్య, లక్ష్మయ్య, పర్శయ్య రాములు తదితరులు పాల్గొన్నారు.



బావిలో తాడును పట్టుకొని వేలాడుతున్న వృద్ధురాలు రాచర్లబొప్పాపూర్‌కు చెందిన గంభీర్‌పూర్ రాజవ్వ. ఇంటి ముందు రాజవ్వ కూర్చున్న సమయంలో కోతులమంద దాడి చేయడంతో భయంతో పరుగెత్తి బావిలో పడింది. దాదాపు 25 గజాల లోతు ఉన్న చేదబావిలో పడ్డ రాజవ్వ తాడును పట్టుకొని కేకలు వేయడంతో చుట్టపక్కల వారు గమనించి పైకి తీశారు. అదే గ్రామానికి చెందిన నిరుద్యోగి రాజేంద్రప్రసాద్ కాంపిటీటివ్ పరీక్షలకు సిద్ధమవుతుండగా కోతులు దాడి చేయడంతో పరీక్షకు హాజరుకాలేకపోయాడు.



ఈ చిత్రంలోని యువకుడు ముస్తాబాద్‌కు చెందిన మిర్యాల్‌కార్ సుమన్. సదరు యువకుడు కులవృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇంటి వద్ద ఉన్న సుమన్‌పై కోతులు దాడి చేయడంతో భయంతో పరుగెత్తి కిందపడ్డాడు. ఈ సంఘటనలో సుమన్ చేయి, కాలు ఫ్యాక్చర్ అయ్యాయి. చికిత్సకు రూ.లక్ష వరకు ఖర్చు చేశాడు.

మంకీ ఫుడ్‌కోర్టులు మాయం

- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం
- గ్రామాల్లో పెరుగుతున్న కోతుల దాడులు
- నిస్సహాయ స్థితిలో ప్రజలు
- ఈ ఏడాదిలోనే 588 మందిపై దాడి



గోపాల్‌పల్లిలో ఎండిపోయిన నేరేడు చెట్లు

ముస్తాబాద్(సిరిసిల్ల): కోతులు అడవిని విడిచి గ్రామాలపై దాడి చేస్తున్నాయి. అడవిలో పండ్ల మొక్కలు లేకపోవడంతో ఊళ్లపై పడుతున్నాయి. మనుషులపై కోతులమూక దాడి చేస్తుండడంతో ఇప్పటికే చాలా మంది గాయాలపాలయ్యారు. ఊళ్లలోకి వచ్చిన కోతులను తరిమికొట్టేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మంకీ ఫుడ్ కోర్టులు ఫలితమివ్వడం లేదు. కోతులు వాపసు పోకపోగా.. ప్రజలకు వానరాల బాధలు తీర లేదు. ఈ ఒక్క ఏడాదిలోనే జిల్లాలో 588 మంది కోతుల దాడిలో గాయపడ్డారు.

జిల్లాలో 32 మంకీఫుడ్ కోర్టులు

కోతుల బెడదను తగ్గించేందుకు ప్రభుత్వం మంకీఫుడ్ కోర్టులను ఏర్పాటు చేసింది. జిల్లాలో 32 గ్రామాల్లో మంకీ ఫుడ్‌కోర్టులను నాలుగేళ్ల క్రితం ప్రారంభించారు. ప్రభుత్వ భూముల్లో జామ, మామిడి, చింత, సీతాఫలం, చీమచింత, వెలగ, నేరేడు మొక్కలు నాటారు. వీటిని రెండేళ్ల పాటు ఉపాధిహామీ ఆధర్యంలో కాపాడారు. పట్టించుకునే వారు లేక ఎండిపోయాయి. ఫలితంగా కోతులు ఊళ్లను వీడడం లేదు.

కోతుల దాడులు ఇలా..

- గత జనవరి నుంచి జూలై వరకు జిల్లాలో 588 మందిపై దాడులు చేశాయి. జిల్లాలోని పీహెచ్‌సీలలో చికిత్స తీసుకున్న వారి వివరాలు మాత్రమే. ఇంకా చికిత్స తీసుకోని వారెందరున్నారో తెలియదు.
- పోతుగల్ పీహెచ్‌సీ పరిధిలో 70 మంది, వేములవాడ ఏరియా ఆసుపత్రిలో 115, సిరిసిల్ల ఆస్పత్రిలో 126, ఎల్లారెడ్డిపేటలో 49, ఇల్లంతకుంటలో 84, కోనరావుపేటలో 21 మంది చికిత్స తీసుకున్నారు.
- కోతులకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం ద్వారానే వాటి సంతతిని తగ్గించవచ్చు. లక్షల్లో ఉన్న కోతులకు కు.ని. ఆపరేషన్లు చేయాలంటే పశుసంవర్ధకశాఖలో తగినంత మంది వైద్యులు, సిబ్బంది లేరు.

పంటలపై తీవ్ర ప్రభావం

జిల్లాలోని పల్లెల్లో కోతుల బెడదతో కూరగాయాల సాగు బంద్ చేశారు. వరి తప్ప ఇతర పంటలు వేస్తే కోతులు పాడుచేస్తున్నాయి. ఇంటి పెరటిలోనూ చాలా మంది గతంలో కూరగాయాలు పండించుకునే వారు. ఇప్పుడా పరిస్థితి లేదు. వేరుశెనగ, బబ్బెర, పెసర పంటలను వేసేందుకు రైతులు జంకుతున్నారు.

బయటకు రాలేకపోతున్నాం



ముస్తాబాద్‌లో కోతులు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. కొద్దిరోజులు కొండెంగలను తింపారు. అయినా ప్రయోజనం లేదు. ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నాం.

– పిన్నోజు ప్రభాకర్, ముస్తాబాద్

600 కోతులను తరలించాం



ముస్తాబాద్ మండల కేంద్రంలో రూ.4లక్షలు వెచ్చించి 600 కోతులను పట్టించాం. పట్టుబడ్డ కోతులను ప్రత్యేక వాహనాల్లో నిర్మల్ అడవులకు సురక్షితంగా తరలించాం. ప్రజల బాధలు చూడలేక ఇలా చేశాం. అయినా ఇంకా కోతులు ఉన్నాయి.

– జనగామ శరత్‌రావు, ఎంపీపీ

'గృహలక్ష్మి'ని వడబోశారు



దరఖాస్తుదారుల వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తున్న అధికారులు



ఇది వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో ఓ పూరి ఇంటి ముందు ఎంపీడీవో అధికారుల బృందం సర్వే. గృహలక్ష్మి పథకంలో ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇంటికి వెళ్లి క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించి అక్కడే లబ్ధిదారుల సమగ్ర సమాచారాన్ని నమోదు చేసుకుంటున్నారు. అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా ఫొటోలను సైతం తీసి వాస్తవాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. పూరింటి స్థానంలో ఇల్లు నిర్మాణానికి ప్రభుత్వం రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉండగా.. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఇలా ఇంటింటి సర్వేలు సాగుతున్నాయి.

- ఇంటింటి సర్వేలు పూర్తి
- జిల్లాలో 14,731 మంది అర్హులు
- మంజూరుపత్రాల జారీకి రంగం సిద్ధం

సిరిసిల్ల: జిల్లాలో గృహలక్ష్మి పథకంలో ఇంటి నిర్మాణానికి దరఖాస్తులు చేసుకున్న 22,117 మంది ఇళ్ల వద్ద అధికారులు సర్వే చేస్తున్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవాలను సేకరిస్తున్నారు. జిల్లాలో లబ్ధిదారుల ఇంటింటి సర్వేలు తుది దశకు చేరాయి. జిల్లాకు మొత్తం 6,300 ఇళ్లు గృహలక్ష్మిలో మంజూరయ్యాయి. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్ల పర్యవేక్షణలో క్షేత్రస్థాయి విచారణకు కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. ఈమేరకు జిల్లాలో విచారణ పూర్తయింది. ఇప్పటి వరకు మొత్తం 21,981 ఇళ్లను అధికారులు విచారణ చేపట్టగా.. ఇందులో 14,731 మంది అర్హులుగా తేలారు. జిల్లాలో మొత్తం దరఖాస్తుదారుల్లో ఇప్పటికే 100 శాతం క్షేత్రస్థాయి సర్వే పూర్తయింది. ఇందులో 67 శాతం మంది గృహలక్ష్మి పథకానికి అర్హులుగా తేలారు.

ఆన్‌లైన్‌లోకి సర్వే సమాచారం

క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారాన్ని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. కలెక్టర్ అనుమతితో మహిళల పేరిట గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు జారీకానున్నాయి. మంజూరుపత్రాలు జారీ అయిన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.3 లక్షలు మంజూరు చేస్తుంది. జిల్లాలో గృహలక్ష్మి పథకంలో అన్ని మండలాల్లోనూ వంద శాతం సర్వే పూర్తయింది. జిల్లాకు 6,300 గృహలక్ష్మి ఇళ్లు మంజూరుకాగా 14,731 మంది అర్హత సాధించారు. ఇందులోనూ ఏ ప్రాతిపదికన ఎంపిక చేస్తారోననే అనుమానాలు ఉన్నాయి. కలెక్టర్ అనురాగ్ జయంతి అత్యంత పేదరికంలో ఉన్న వారిని మొదటి ప్రాధాన్యంలో ఎంపిక చేయాలని సూచించారు.

జిల్లాలో గృహలక్ష్మి స్వరూపం

మండలం	దరఖాస్తులు	అర్హులు
సిరిసిల్ల పట్టణం	2,577	2,012
తంగళ్లపల్లి	1,889	735
ముస్తాబాద్	1,453	792
గంభీరావుపేట	2,280	2,097
వీర్నపల్లి	1,145	788
వేములవాడ పట్టణం	1,300	757
వేములవాడ రూరల్	841	665
కోనరావుపేట	1,757	1219
చందుర్తి	1,238	712
వేములవాడ అర్బన్	823	584
రుద్రంగి	1,174	853
బోయినపల్లి	1,314	1,045
ఇల్లంతకుంట	1,771	1,232

ప్రాణభిక్ష పెట్టండి

- కోమాలోకి యువకుడు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు
- చికిత్సకు రూ.5లక్షలు అవసరం
- ఆదుకోవాలని యువకుడి తండ్రి వేడుకోలు



ప్రాణాపాయ స్థితిలో నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రదీప్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): భవనం పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడ్డ యువకుడు కోమాలోకి వెళ్లి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తమ కుమారుడిని కాపాడండంటూ కన్నతండ్రి వేడుకుంటున్నాడు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లికి చెందిన చాతాని ప్రదీప్ నాలుగు రోజుల క్రితం భవనంపై నుంచి జారీ కింద పడ్డాడు. రాత్రిపూట కావడంతో ఉదయం వరకు ఎవరూ గమనించలేదు. తీవ్రంగా రక్తస్రావమైంది. సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. ప్రదీప్‌కు మెరుగైన వైద్యం అందించాలంటే సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. చేతిలో చిల్లిగవ్వ లేని తండ్రి లింగారెడ్డి తన కుమారుడి ప్రాణాలు నిలబెట్టాలని వేడుకుంటున్నాడు. లింగారెడ్డి కుటుంబ పరిస్థితి తెలిసి ఇప్పటికే కొందరు దాతలు సాయం అందించారు. సహృదయంతో ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని కోరుతున్నాడు.

సాయం చేయాల్సిన దాతలు ఫోన్‌పే 99488 34616 నంబర్‌లో ఆర్థిక సహాయం అందించాలి

తప్పిదాలు లేకుండా ఓటరు జాబితా

- కలెక్టర్ అనురాగ్‌జయంతి
- పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఓటరు జాబితా వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ అనురాగ్‌జయంతి

సిరిసిల్ల: తప్పులు లేకుండా ఓటరుజాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. సిరిసిల్లలోని తారకరామానగర్‌లోని 144, 145, గాంధీనగర్‌లోని 121, 133 పోలింగ్ కేంద్రాల్లో చేపడుతున్న ఓటరు నమోదును ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పద్దెనిమిదేళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త పునరీక్షణ కార్యక్రమాన్ని వచ్చే నెల 2, 3 తేదీలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్డీవో ఆనంద్‌కుమార్, తహసీల్దార్ షరీఫ్ మొహినొద్దీన్, నాయబ్ తహసీల్దార్ మనోజ్, ఆర్‌ఐలు సంతోష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

గంజివాగు కష్టాలు దూరం

- హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ.1.80 కోట్లు
- తీరనున్న ప్రయాణ కష్టాలు
- నేడు ఎమ్మెల్యే భూమిపూజ



స్తంభంపల్లి గంజివాగు కల్వర్టు

బోయినపల్లి(చొప్పదండి): చిన్నపాటి వర్షానికి కల్వర్టుపై నుంచి వరద ప్రవహిస్తుండడంతో ఏళ్లుగా వర్షాకాలం ప్రయాణకష్టాలు ఎదుర్కొన్నారు. బోయినపల్లి మండలం స్తంభంపల్లి వద్ద గల గంజివాగుపై చిన్నపాటి వర్షానికే వరద పొంగి ప్రవహించేది. ఇక్కడ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 కోట్లు మంజూరు చేసింది. సోమవారం బ్రిడ్జి నిర్మాణానికి చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ భూమిపూజ చేయనున్నారు.

దూరంకానున్న వరద కష్టాలు

బోయినపల్లి నుంచి వేములవాడ, వేములవాడ నుంచి గంగాధర ప్రయాణించాలంటే స్తంభంపల్లి గంజివాగు కల్వర్టుపై నుంచి ప్రయాణించాలిందే. గత నాలుగేళ్లుగా వర్షాకాలంలో కురుస్తున్న వర్షాలకు గంజివాగు వరద ఉధృతిగా ప్రవహిస్తుండడంతో కల్వర్టుపై పెద్ద ఎత్తున వరద వచ్చి రాకపోకలు నిలిచిపోతున్నాయి. మూడేళ్ల క్రితం స్తంభంపల్లికి చెందిన ఒకరు పాలు పోసేందుకు వేములవాడకు సైకిల్‌పై వెళ్తుండగా గంజివాగు వరదలో కొద్ది దూరం కొట్టుకుపోయాడు. చివరికి ఓ కొమ్మను పట్టుకోవడంతో స్థానికులు తాళ్లతో లాగి బయటకు తీశారు. ప్రతీ సారి వర్షం కురినప్పుడు స్తంభంపల్లి గ్రామపంచాయతీ, పోలీస్, రెవెన్యూ సిబ్బంది కల్వర్టు వద్ద రాకపోకలు నిలిపివేసేందుకు చాలా కష్టపడుతున్నారు.

నేడు హైలెవల్ బ్రిడ్జికి భూమిపూజ

స్తంభంపల్లి గంజివాగు లోలెవల్ కల్వర్టు స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80కోట్లు మంజూరు చేయగా.. సోమవారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ భూమిపూజ చేయనున్నారు. స్తంభంపల్లి, గుండన్నపల్లి, భూర్గుపల్లి, బోయినపల్లి, తడగొండ, కోరెం గ్రామాల ప్రజలకు రవాణా కష్టాలు తీరనున్నాయి.

ఇబ్బందులు తొలగుతాయి



స్తంభంపల్లి గంజివాగు కల్వర్టుపై నుంచి వరద పారితే వేములవాడకు, బోయినపల్లి, గంగాధరలకు ప్రయాణాలు నిలిచిపోతాయి. ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే రవిశంకర్‌కు వివరించాం. ఎమ్మెల్యే ప్రభుత్వంతో మాట్లాడి నిధుల మంజూరుకు కృషిచేశారు.

– పర్లపల్లి వేణుగోపాల్, ఎంపీపీ, బోయినపల్లి

ఎన్నోసార్లు విన్నవించాం



స్తంభంపల్లి లోలెవల్ కల్వర్టు స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే, ఎంపీపీ, జెడ్పీటీసీలకు పలుసార్లు వినతిపత్రాలు ఇచ్చాం. ఎట్టకేలకు హైలెవల్ బ్రిడ్జికి నిధులు మంజూరుకావడం ఆనందంగా ఉంది. పనులు త్వరగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– అక్కెనపెల్లి జ్యోతి, స్తంభంపల్లి సర్పంచ్

హైలెవల్ బ్రిడ్జికి రూ.1.80 కోట్లు



బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే దారిలో స్తంభంపల్లి గంజివాగు కల్వర్టు లోలెవల్ బ్రిడ్జి స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.80 కోట్లు మంజూరయ్యాయి. హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంతో ఎంత వరద వచ్చిన రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ప్రయాణికుల రవాణా కష్టాలు తొలగుతాయి.

– సత్యనారాయణ, పీఆర్, డీఈఈ, వేములవాడ

క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన సెస్ చైర్మన్



ఎమ్మెల్యే రమేశ్‌బాబుతో రామారావు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రాష్ట్ర వ్యవసాయరంగ ప్రభుత్వ సలహాదారుగా నియామితులైన వేములవాడ ఎమ్మెల్యే డాక్టర్ చెన్నమనేని రమేశ్‌బాబును ఆదివారం సెస్ చైర్మన్ చిక్కాల రామారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రమేశ్‌బాబుకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయస్థాయి క్రీడాకారులకు సన్మానం



క్రీడాకారులను సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జాతీయ స్థాయిలో రాణించిన వాలీబాల్ క్రీడాకారులను ఎల్లారెడ్డిపేటలో మండల రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. వాలీబాల్ పోటీలలో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన పెద్దూరి రమ్య, పెద్దూరి సహనలను సత్కరించారు. రాచర్లగొల్లపల్లికి చెందిన రమ్య, సహన మహారాష్ట్ర, రాజస్తాన్, అస్సాం, కర్ణాటక రాష్ట్రాలలో సీనియర్ మీట్‌గా జాతీయ స్థాయిలో రాణించారు. రాష్ట్ర రజక సంఘం కార్యదర్శి బాలమల్లు, మండల గౌరవ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు దేవయ్య, బోనాల రవి, పోచయ్య, అజయ్, రాజు, చంద్రయ్య, రాములు పాల్గొన్నారు.

ఉచిత న్యూరో వైద్యశిబిరం



ఉచిత వైద్యశిబిరానికి తరలివచ్చిన రోగులు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని బీవైనగర్‌లో ఉచిత న్యూరో మెగా వైద్యశిబిరానికి స్పందన లభించింది. కట్టమైసమ్మ తల్లి గోల్డెన్ టెంపుల్, సిరి ఆస్పత్రి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. డాక్టర్ సూర్యప్రకాశ్‌రావు ఉచిత వైద్య సేవలు అందించగా నిర్వాహకులు 400 మందికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. టెంపుల్ ట్రస్టు చైర్మన్ కొండ ప్రతాప్, ప్రధాన కార్యదర్శి ఎనగందుల శ్రీనివాస్, కోశాధికారి బైరి రాజమల్లు పాల్గొన్నారు.

నేడు యాదగిరిగుట్టకు బొప్పాపూర్ వాసులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ గ్రామస్తులు సర్పంచ్ కొండపురం బాల్‌రెడ్డి, జిల్లా గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈనెల 28న సోమవారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామిని దర్శించుకునేందుకు తరలివెళ్తున్నారు. బాల్‌రెడ్డి, గోవర్ధన్‌గౌడ్‌సొంత ఖర్చులతో గ్రామస్తులు స్వామివారిని దర్శించుకునేందుకు 15 బస్సుల్లో తరలివెళ్తున్నారు. ఉదయం అల్పాహారంతో మొదలుకోని మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ వరకు పూర్తి ఖర్చులతో వారే గ్రామస్తులకు స్వామివారిని దర్శనం చేయించారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోని పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

గుట్టలను తొలగిస్తే బతకలేం

- తవ్వకాలతో రెండు నెలలుగా పని లేదు..
- బతకడం కష్టమవుతోందని వడ్డెరుల ఆవేదన
- పెద్దూరు ఎల్లమ్మ గుట్ట వద్ద మట్టి తీస్తున్న జేసీబీల అడ్డగింత
- జీవనోపాధి కల్పించాలని ప్రభుత్వానికి వేడుకోలు



ఎల్లమ్మ గుట్ట వద్ద జేసీబీని అడ్డుకున్న వడ్డెరులు

సిరిసిల్లఅర్బన్: పగలనకా.. రాత్రినకా బండలు కొడుతూ వాటిని అమ్ముకోగా వచ్చే అరకొర ఆదాయంతో వడ్డెరులు బతుకీడుస్తున్నారు. వంశ పారంపర్యంగా వచ్చిన వృత్తిపైనే ఆధారపడి, తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. కానీ ప్రస్తుతం వారు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. గుట్టల ఆధారంగా జీవనోపాధి పొందుతుండగా వాటిని ప్రైవేట్ వ్యక్తులు కొల్లగొడుతున్నారు. బండలను తొలగిస్తూ మట్టిని తరలిస్తూ చదును చేస్తున్నారు. ప్రభుత్వం కూడా పలు అభివృద్ధి పనులకు తీసుకుంటుండటంతో వడ్డెరులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలలుగా పని లేదని, ప్రభుత్వం స్పందించి, తమకు జీవనోపాధి కల్పించాలని వేడుకుంటున్నారు.

వడ్డెర కాలనీలో దాదాపు 60 కుటుంబాలు

సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు వడ్డెర కాలనీలో దాదాపు 60 కుటుంబాలకు చెందినవారు బండలు కొడుతూ ఉపాధి పొందుతున్నారు. దాదాపు 300 మందికి ఈ వృత్తే ఆధారం. పెద్దూరు చుట్టుపక్కల ఉన్న మైసమ్మ, ఎల్లమ్మ, బైపాస్ సమీపంలోని అర్ధరాళ్ల బోరు, సర్దాపూర్ తదితర గుట్టలపై వారి తాతముత్తాతల కాలం నుంచి బండలు కొడుతున్నారు. ప్రస్తుతం కొందరు వ్యక్తులు మట్టి కోసం ఈ గుట్టలను తొలగించడం, ప్రైవేట్ వ్యక్తులు తీసుకోవడం, ప్రభుత్వం అభివృద్ధి పనులకు కేటాయించడంతో చదును చేస్తున్నారు. దీనివల్ల తాము ఉపాధి కోల్పోతున్నామని వడ్డెరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుట్టలను తొలగిస్తే తాము బతకమలేమని వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఎల్లమ్మ గుట్ట వద్ద మట్టి తీస్తున్న జేసీబీలను అడ్డుకున్నారు.

ఉపాధి కల్పించాలి



30 ఏళ్లుగా బండలు కొడుతూ వడ్డెరులు కుటుంబాలను పోషించుకుంటున్నారు. ప్రస్తుతం కొందరు వ్యక్తులు గుట్టలపై తవ్వకాలు జరుపుతూ ఉపాధిని దెబ్బతీస్తున్నారు. బండలు కొడితే అటవీ అధికారులు బెదిరిస్తున్నారు. ప్రభుత్వం బాధితులకు ఉపాధి కల్పించాలి. – సూర దేవరాజు, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు

బండలు కొడ్తెనే పూటగడ్తది



వడ్డెర కాలనీకి చెందిన మేము బండలు కొట్టుకుంట మా కుటుంబాలను సాదుకుంటున్నం. బండలు కొడ్తెనే మాకు పూటగడ్తది. మైసమ్మ, ఎల్లమ్మ గుట్టలను కొందరు తవ్వుతర్రు. రెండు నెలల సంది పనిలేక బతుకుడు కట్టమైతంది. సర్కారే మాకు దారి సూపాలె. – శివరాత్రి కనకయ్య, పెద్దూరు వడ్డెర కార్మికుడు

సర్కారు ఆదుకోవాలె



మా తాతముత్తాతల కాలం నుంచి పెద్దూరు చుటుపక్కల గుట్టలపై బండలు కొట్టుకుంట బతుకుతన్నం. కానీ ఇప్పుడు మా పరిస్థితి మంచిగలేదు. ప్రభుత్వం గుట్టలను తీసుకుంటూ ప్రవేటోళ్లకు ఇత్తంది. మాకు పనుం టలేదు. సర్కారే ఆదుకోవాలె. – శివరాత్రి బుచ్చయ్య, వడ్డెర కార్మికుడు

బీఆర్‌ఎస్ పాలన రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టింది

- అసోం రాష్ట్ర పలాజ్ బరి ఎమ్మెల్యే హేమంగ్ తకోరియా



మాట్లాడుతున్న హేమంగ్ తకోరియా

వేములవాడ: బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టేసిందని అసోం రాష్ట్రం పలాజ్ బరి ఎమ్మెల్యే హేమంగ్ తకోరియా అన్నారు. పట్టణంలోని భీమేశ్వరగార్డెన్‌లో ఆదివారం ప్రవాస్ యోజన ముగింపు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని వేములవాడ నియోజకవర్గంలో ఎనిమిది రోజుల పాటు ప్రవాస్ యోజన కార్యక్రమం సంతృప్తికరంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీలేదని, రైతులకు ఎలాంటి పథకాలు ఇవ్వలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. వేములవాడ నియోజకవర్గంలో బీజేపీ బలంగా ఉందని, రాబోయే రోజుల్లో అధికారంలోకి వచ్చేలా అడుగులు వేస్తోందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రతాప రామకృష్ణ, ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేశ్, జిల్లా ప్రధానకార్యదర్శి రేగుల మల్లికార్జున్, నియోజకవర్గంలోని ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

నిరుపేదకు ఆర్థికసాయం

- నిరంతరం కొనసాగుతున్న సేవా కార్యక్రమాలు
- దాతల సహకారంతోనే 848 రోజులుగా...
- నిర్వాహకులు మధు మహే



అన్నదానం చేస్తున్న ట్రస్టు సభ్యులు

వేములవాడరూరల్: మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన బొమ్మగోని చంద్రశేఖర్ తాడిచెట్టుపై నుంచి పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన చంద్రశేఖర్ వైద్యఖర్చులకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో విషయం తెలుసుకున్న మై వేములవాడ ట్రస్టు సభ్యులు ఆయనకు ఆర్థిక సాయం అందించారు. నాలుగు రోజుల క్రితం రూ.10 వేలు అందించిన ట్రస్టు సభ్యులు మళ్లీ ఆదివారం ఓ వ్యక్తి చేసిన ఆర్థిక సాయంను నేరుగా గ్రామానికి వెళ్లి అందించారు. ఇందులో ట్రస్టుసభ్యులు మధు మహేశ్, తాళ్లపల్లి ప్రశాంత్, రవి, నంది సాయికుమార్, మఠం రాకేశ్, నేరెళ్ల సాయి ఉన్నారు.

848 రోజులు అన్నదానం

మై వేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛంద సేవా కార్యక్రమం 848 రోజులకు చేరినట్లు నిర్వాహకులు మధు మహేశ్ తెలిపారు. సంస్థ తరపున ప్రతిరోజు నిరుపేదలకు అన్నదానం చేస్తూ, కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారికి దాదాపు 80 మందికి పైగా వ్యక్తులకు నగదు రూపంలో, వస్తురూపంలో సాయం అందించినట్లు పేర్కొన్నారు. కుల, మతాలకు అతీతంగా వేములవాడ పట్టణ, మండలాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని స్వచ్ఛందంగా కొంతమంది దాతలు, మిత్రుల సహకారంతో కొనసాగిస్తున్నామన్నారు.

గల్లంతైన హెడ్‌కానిస్టేబుల్ మృతి



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు



మృతదేహాన్ని బయిటికి తెస్తున్న కుటుంబసభ్యులు

- తిమ్మాపూర్–ముంజంపల్లి శివారులో మృతదేహం లభ్యం

తిమ్మాపూర్: కాకతీయ కాలువలో శుక్రవారం సాయంత్రం గల్లంతైన హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య (50) మృతిచెందారు. ఆదివారం సాయంత్రం ఆయన మృతదేహం లభ్యమైంది. తిమ్మాపూర్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం నుంచి కాలువలోని గేట్లలో ఒకటి మూసుకోకపోవడంతో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. సీఐ ఎస్సారెస్పీ అధికారులతో మాట్లాడి, గేటు త్వరగా మూసివేయాలని కోరారు. వారు శ్రమించి, ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు మూయించారు. దీంతో గాలింపు చర్యలు వేగవంతంచేశారు. సాయంత్రం 6గంటలకు తిమ్మాపూర్–ముంజంపల్లి శివారులో మల్లయ్య మృతదేహం దొరికినట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య హేమలత, కూతుళ్లు కీర్తన, శ్రీజ ఉన్నారు.

పర్యవేక్షించిన ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య కొన్నేళ్లుగా మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు వద్ద గన్ మెన్‌గా పని చేస్తున్నారు. ఆయన కాకతీయ కాలువలో గల్లంతయ్యారని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం కాలువ వద్దకు వచ్చారు. గాలింపు చర్యలను పర్యవేక్షించారు. మృతుని కుటుంబసభ్యులను ఓదార్చారు.

ఎనిమిదేళ్లకే నూరేళ్లు నిండాయి

- గుండెపోటుతో చిన్నారి మృతి
- జిల్లెల్ల గ్రామంలో విషాదం



హర్షిత (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): చిన్నతనంలోనే గుండెపోటు రావడంతో చిన్నారి ప్రాణాలు విడిచిన ఘటన తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో విషాదం నింపింది. గ్రామానికి చెందిన బొల్లం హర్షిత ఉరఫ్ జాను(8) శనివారం రాత్రి గుండెపోటుతో మరణించింది. హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచింది. తల్లి రమ్య మూడేళ్లక్రితం రోడ్డు ప్రమాదంలో మరణించింది. తండ్రి సతీశ్‌గౌడ్ భార్య, కూతురి మరణంతో కన్నీరుమున్నీరయ్యాడు. జిల్లెల్ల గ్రామంలో విషాదం నెలకొంది.

చిన్నారులపై వీధికుక్కల దాడి



ఏడుస్తున్న చిన్నారి

వేములవాడ: పట్టణంలోని 17వ వార్డులో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఈక్రమంలో ఆదివారం ఇంటి ముందు ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులను వీధి కుక్క కరవడంతో ఆందోళనకు గురయ్యారు. వార్డులో కుక్కలు ప్రజల్ని గాయపరుస్తున్నాయని ఎన్నిసార్లు మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులపై కుక్క దాడిచేస్తున్నక్రమంలో గమనించిన దుర్గాప్రసాద్, నాగరాజ్ స్థానికులు చిన్నారులను కుక్కలబారి నుంచి రక్షించారు. చిన్నారుల తల్లిదండ్రులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు అభినందన

చందుర్తి: రాష్ట్ర వ్యవసాయరంగ వ్యవహారాల ప్రభుత్వ సలహదారుగా నియమితులైనా వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబును చందుర్తి ఎంపీపీ బైరగోని లావణ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య తదితరులు హైదరాబాద్‌లో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు కలిసిన వారిలో బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు మరాఠి మల్లిక్, మార్కెట్‌కమిటీ డైరెక్టర్లు కొండ లక్ష్మన్‌గౌడ్, లకావత్ శత్రునాయక్, బీఆర్‌ఎస్ నాయకులు మల్యాల గంగనర్సయ్య, మందాసు ప్రసాద్ తదితరులు ఉన్నారు.

తాడూర్‌లో కాంగ్రెస్ జెండా పండగ

తంగళ్లపల్లి: మండలంలోని తాడూర్ గ్రామంలో ఆదివారం సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ జెండా పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా కేకే మాట్లాడుతూ.. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తామని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు రెడ్డిమల్ల సుధాకర్, మండల అధ్యక్షుడు ప్రవీణ్ టోని, లింగాల భూపతి, తిరుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, మహేందర్, సాయి ప్రసాద్, పరుశురాం, మునిగెల రాజు, ఆరెపల్లి బాలు, శ్యామ్, భరత్, సునీల్, చరణ్, మహిపాల్ రెడ్డి, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కమ్యూనిటీ హాల్ నిర్మించాలి..

సిరిసిల్లటౌన్: మంత్రి కేటీఆర్ హామీ మేరకు జిల్లాకేంద్రం సిరిసిల్లలో దివ్యాంగుల కోసం కమ్యూనిటీహాల్ నిర్మించాలని దివ్యాంగులు కోరారు. ఆదివారం సిరిసిల్ల సత్యసాయి సేవా మందిరంలో దివ్యాంగుల సంక్షేమ సమితి సమావేశంలో ఈ మేరకు తీర్మానించగా అధ్యక్షుడు మంగళారపు రాజేందర్ మాట్లాడారు. గతంలో మంత్రి కేటీఆర్ ఆత్మీయ సమ్మేళనంలో కమ్యూనిటీ హాల్ నిర్మించి ఇస్తామన్నారన్నారు. హాల్ లేక దివ్యాంగులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో వెల్ది హరిప్రసాద్, ఆకుల సంధ్య, ఖాదర్, లత తదితరులున్నారు.

ప్రమాదవశాత్తు యువకుడికి తీవ్రగాయాలు

- నుజ్జునుజ్జయిన చేతివేళ్లు
- కరీంనగర్ ఆస్పత్రికి తరలింపు



చికిత్సపొందుతున్న జలంధర్

చందుర్తి: ఆవులకు మేతకోసం గడ్డిని గ్రాస్ కట్టర్‌లో వేస్తుండగా ప్రమాదవశాత్తు మిషిన్‌లో పడి చేయి నుజ్జునుజ్జయింది. చందుర్తి మండలం కిష్టంపేటకు చెందిన ఉగిలే జలంధర్(22) యువకుడు ఉదయం పశువులకు మేత వేసేందుకు పాక వద్దకు వెళ్లాడు. పచ్చిగడ్డిని గ్రాస్‌కట్టర్‌లో వేస్తుండగా ప్రమాదవశాత్తు చేయి మిషన్‌లో పడి చేతివేళ్లు తెగిపోయాయి. దీంతో చుట్టుపక్కల రైతులు మిషన్ ఆఫ్‌చేసి గాయపడిన యువకుడిని గ్రామస్తులు వేములవాడ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తెలపడంతో కరీంనగర్‌లోని చల్మెడ ఆనందరావు ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా చల్మెడ లక్ష్మీనరసింహారావు యువకుడిని కలిసి పరామర్శించారు.

వెంటాడుతున్న విధి...

ఉడిలె లక్ష్మి–సత్తయ్య దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు జలంధర్ జీవనోపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి ఇటీవల ఇంటికొచ్చాడు. ఈక్రమంలో ఆదివారం పశువులను మేత వేస్తుండగా ప్రమాదవశాత్తు గ్రాస్‌కట్టర్‌లో చేయి పడి ప్రమాదం జరగ్గా కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు 15 రోజులు గడిస్తే గల్ఫ్‌వెళ్లే వాడని రోదిస్తున్నారు. చిన్న కుమారుడు శ్రీనాథ్ నెలరోజుల క్రితం బైక్‌పై నుంచి కిందపడడంతో కాలు విరిగింది. నెలరోజుల వ్యవధిలో ఈ రెండు ఘటనలు జరగడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకుగురవుతున్నారు.

ఆదుకునే వారి కోసం ఎదురుచూపులు

రెక్కలు ముక్కలయ్యేలా పనిచేసుకుంటే ఆ కుటుంబానికి పూట గడిచేది. నెలరోజులుగా పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఆకుటుంబం రోజురోజుకు ఆర్థికంగా చితికిపోతుంది. కుటుంబం గడవడమే కష్టంగా ఉందని చేతికి అందివచ్చిన కొడుకును రెండేళ్ల కిందటే గల్ఫ్ పంపించారు. తల్లిదండ్రులను చూసి వెళ్దామని గల్ఫ్‌నుంచి ఇంటికొచ్చి పెద్ద కుమారుని చేతు క ట్ కావడం, ఇంతకుముందే నెల రోజులు చిన్న కు మారుడు శ్రీనాథ్ కాలు విరగడంతో వైద్యం చేయించలేక ఆదుకునే వారికోసం ఆ కుటుంబం ఆశగా ఎదురుచూస్తుంది. దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్నారు. సాయం అందించే వారు ఫోన్ పే 96032 90647 నంబర్‌లో పంపించాలని వేడుకుంటున్నారు.

ఆశీర్వదించండి...అభివృద్ధి చేసి చూపిస్తా

- ఏకాదశి రోజున ఎన్నికల శంఖారావం
- కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలి
- బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మినర్సింహారావు



మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మినర్సింహారావు

వేములవాడ: మీరంతా ఆశీర్వదించి అవకాశం కల్పిస్తే వేములవాడను అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మినర్సింహారావు అన్నారు. పట్టణంలోని 25వ వార్డు మార్కండేయనగర్‌లో కౌన్సిలర్ గూడూరి లక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం డప్పుచప్పుళ్ల మధ్య ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేములవాడ రాజన్న ఆశీర్వాదంతో సేవచేసే అవకాశం లభించిందన్నారు. ఏకాదశి నాడు ఎన్నికల శంఖారావం పూరించడం శుభసూచకంగా భావిస్తున్నానన్నారు. మున్సిపల్‌లో అత్యధిక మెజార్టీతో కౌన్సిలర్‌ను గెలిపించిన ఈ వార్డుప్రజల ఆహ్వానాన్ని ఎప్పటికీ మరిచిపోలేనన్నారు. గూడూరి లక్ష్మి–మధు వంటి సేవాగుణం కలిగిన వ్యక్తులను గెలిపించుకోవడం వార్డు ప్రజల అదృష్టమన్నారు. కలిసికట్టుగా పని చేద్దాం...సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేద్దామన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే రమేశ్‌బాబు నాయకత్వంలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి సాధించిందనీ, రాబోయే రోజుల్లో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు మీ ముందుకు వచ్చానన్నారు. కార్యక్రమంలో బావనరుషి సేవాసంఘం అధ్యక్షుడు కొక్కుల వేణు, గౌరవ అధ్యక్షుడు వేముల భాస్కర్, కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్, రుద్రంగి జెడ్పీటీసీ గట్ల మీనయ్య, మాడిశెట్టి ఆనందం, మహిళలు పాల్గొన్నారు.

పది క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడ్డ బియ్యంతో పోలీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ శివారులో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా ఆదివారం పట్టుకున్నామని పోలీసులు తెలిపారు. గూడెంకు చెందిన అల్వాల స్వామి, ముద్రకోల ప్రశాంత్, సామ్యూల్, వానరాశి మల్లయ్య ఓ వాహనంలో బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. ముస్తాబాద్‌లో రేషన్‌బియ్యం దందా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బోరు దొంగల కోసం గాలింపు

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల పట్టణంలో బోరుమోటార్లు, ఇనుప కెడ్డీలు చోరీచేసే ముఠాను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. సిరిసిల్ల పట్టణంలోని సిక్‌వాడకు చెందిన పలువురు వ్యక్తులు ఇటీవల ఓ ఇంట్లోని బోరుమోటారుతో పాటు పైపులను దొంగిలించినట్లు అనుమానం వ్యక్తంచేస్తూ వచ్చిన ఫిర్యాదుతో సిరిసిల్ల టౌన్ పోలీసులు గస్తీ తిరుగుతున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. జిల్లాకేంద్రంలో కొత్త భవన నిర్మాణాలు, తాళంవేసిన ఇళ్లను టార్గెట్‌చేస్తూ దొంగలు చోరీలకు పాల్పడుతున్నట్లు ఇటీవల పోలీసులకు ఫిర్యాదులు అందడంతో సిక్‌వాడలో గాలింపు చర్యలు చేపడుతున్నట్లు స్థానికులు తెలిపారు.

మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

- ఆసరా పెన్షన్ ఇప్పిస్తానంటూ మోసం
- ఇంకా బాధితులుంటే ఫిర్యాదుచేయాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: ఆసరా పెన్షన్ ఇప్పిస్తానంటూ నమ్మించి డబ్బులు కాజేసిన మోసగాడిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. నిందితుడి నుంచి పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వివరాల్లోకి వెళితే.. సిరిసిల్లలోని రెడ్డివాడలో నివసిస్తున్న బైరగోని లింగయ్య ఆసరా పెన్షన్లు ఇప్పిస్తానని అందుకు కొంత ఖర్చు అవుతుందని చెప్పి మారుపాకకు చెందిన బోయిని సుజాతను పరిచయం చేసుకుని ఆమె వద్ద నుంచి రూ.45వేలు తీసుకున్నాడు. కొన్నిరోజుల తర్వాత ఆమెకు పింఛన్ మంజూరైందని చెప్పి ప్రతీనెల రూ.2వేలు ఆమె బ్యాంకు ఖాతాలో నిందితుడు లింగయ్య జమచేశాడు. ఈక్రమంలో ఇదే గ్రామానికి చెందిన పడిగెల అపర్ణ, పడిగెల నాగవ్వ, కుమ్మరి భాగ్య నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.13,500 చొప్పున మొత్తం రూ. 40,500 వసూలు చేసి వారికి ఎలాంటి ఆసరా పింఛన్ ఇప్పించకుండా తిరుగుతున్నాడు. దీంతో బాధితులు మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో లింగయ్యను అతని ఇంటివద్ద ఆదివారం సిరిసిల్లటౌన్ పోలీస్‌లు అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. జిల్లాలో ఆసరా పెన్షన్ ఇప్పిస్తానని లింగయ్య ద్వారా మోసపోయిన బాధితులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.

రాజన్న సేవలో జైళ్ల ఐజీ



వేములవాడ:రాజన్నను జైళ్లశాఖ ఐజీ రాజేశ్ కుటుంబ సభ్యులతో ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. నాగిరెడ్డి మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం ఇచ్చి, ప్రసాదం అందజేశారు.